నిర్దేశిత గడువులోగా ఎస్ఐఆర్ పూర్తి చేయాలి

- ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మొరిశెట్టి నివేదిత లక్షాదిలు

దశ, సూర్యాపేట ప్రతినిధి : సూర్యాపేట పట్టణంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను, బీఎల్ఓల పనితీరును ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న లు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పలు వార్డులలో ఆయన నేరుగా పర్యటించి, ఓటర్ల నమోదు మరియు ఫారాల సేకరణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బీఎల్ఓలతో మాట్లాడుతూ 13వ వార్డులోని బూత్ లో ప్రక్రియ మందకొడిగా నియోజకవర్గంలోనే ఈ చాలా తక్కువ శాతం నమోదు అయిందని వేగవంతం చేయాలని అన్నారు. నిర్దేశిత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిచేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఎలాంటి అర్హులైన ఓటరు జాబితా నుంచి మిగిలిపోకుండా, ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో ధృవీకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ప్రజలు కూడా తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన పత్రాలను సమర్పించి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

- జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి: జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా
- జిల్లాలోని ప్రతి మండలంలో టీయూడబ్ల్యూజే కమిటీలు: జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ

దశ, అబ్దుల్లాపూర్‌మెట్: జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుని తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీ యూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో శుక్రవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం కామినేని ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. సమాజ శ్రేయస్సు కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

జర్నలిస్టులకు కార్పొరేట్ వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని, వారి కుటుంబాలకు భరోసా కల్పించే గ్రూప్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) సౌకర్యాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ తరపున ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. యూనియన్‌లో ఉన్న ప్రతి జర్నలిస్టు యూనియన్ బలోపేతం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా, ప్రధాన మేకల సత్యనారాయణలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యూనియన్ ను సంస్థగతంగా బలోపేతం చేయటంలో భాగంగా విస్తృతంగా పర్యటించి మండల, నియోజకవర్గ కమిటీలను వేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలోని జర్నలిస్ట్ ల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు.ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు,ఆక్రిడిటేషన్ లు అందరికీ వచ్చేలా పోరాడతామన్నారు.జిల్లా కోశాధికారి సంరెడ్డి శశిపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జెనిగె పాండు,జిల్లా సంయుక్త కార్యదర్శులు ఆంజనేయులు, దారుగుపల్లి సత్యనారాయణ, సూర్యనారాయణ, జాతీయ కౌన్సిల్‌సభ్యులు ప్రవీణ్, సీనియర్ జర్నలిస్టులు జాల కిషన్, అనంతుల శ్రీనివాస్, సోలిపురం రజనీకాంత్‌రెడ్డి, వర్దెల్లి దశరథ,జిల్లా ఈ సీ సభ్యులు రచ్చా శేఖర్,దర్శనం జంగయ్య,అవంచ సురేందర్‌లతో పాటు వైద్యులు దివ్యారెడ్డి, శ్రేయాన్,మార్కెటింగ్ టీం సందీప్, శ్రీధర్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన మండల కమిటీ ఏర్పాటు

టీయూడబ్ల్యూజే అబ్దుల్లాపూర్‌మెట్ మండల నూతన అధ్య క్షుడిగా గూడెపు జగన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నామా ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడిగా శ్రీరాం యాదయ్య, ఉపాధ్యక్షులుగా కట్టంగూరు మల్లేష్, గండికోట సత్యం, నాగార్జున, జాయింట్ సెక్రటరీలుగా చెరుకు ఉపేందర్, పొలగోని రాజేష్, కుకుట్లపల్లి రాకేష్, కోశాధికారిగా బండ శేఖర్‌రెడ్డి, సలహాదారులుగా గడ్డం భాస్కర్‌రెడ్డి, రాసాల వెంకటేష్‌యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ నాయకుల తీరును వ్యతిరేకిస్తూ నాచారంలో బీజేపీ నాయకుల ర్యాలీ

దశ, ఓయూ: కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఉప్పల్ నియోజకవర్గ బిజెపి నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల తీరును ఖండిస్తూ నాచారం లోని ప్రధాన రహదారిపై మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ మల్లెల నర్సింగ్ రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ అయిన సందర్భంగా పరీక్షను రద్దుచేసి మరల పరీక్ష నిర్వహించి ఫలితాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రెచ్చగొట్టి వారి జీవితాలను నాశనం చేస్తుందని మండిపడ్డారు. పరీక్ష రద్దయి మరల పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇచ్చిన సందర్భంగా దేశంలోని యువత పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను అడ్డం పెట్టుకుని వారి జీవితాలతో ఆడుకుంటూ రాజకీయం చేయడాన్ని బిజెపి పార్టీ వ్యతిరేకిస్తుంది అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రశ్నపత్రాల లీకేజీకి కారణమైన వారిని కఠినంగా శిక్షిస్తామని లీకేజీలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని సైతం చేస్తామని ప్రకటన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ గోరిగే కృష్ణ, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గోపాల్ గౌడ్,అభిషేక్ ,దయా గౌడ్,అంజి,సాయి గౌడ్,వెంకట్ రావు,చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలతో ప్రజల మన్ననలు పొందాలి

దశ సూర్యాపేట ప్రతినిధి : ప్రజలకు నాణ్యమైన వైద్య నిర్ధారణ సేవలను అందుబాటు ధరల్లో అందిస్తూ రాయల్ స్కానింగ్ సెంటర్ వినియోగదారుల మన్ననలు పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, పటేల్ రమేష్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు ఆకాంక్షించారు. సూర్యాపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన రాయల్ స్కానింగ్ సెంటర్‌ను వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ.. వైద్య రంగంలో సకాలంలో, కచ్చితమైన వ్యాధి నిర్ధారణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్కానింగ్, దయాగ్నస్టిక్ సేవలు సూర్యాపేట ప్రజలకు మరింత చేరువ కావడం అభినందనీయమన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో మెరుగైన వైద్య, ఆరోగ్య సదుపాయాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే వైద్య సంస్థలు, సేవా సంస్థలు మరిన్ని ఏర్పాటవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, రాయల్ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు, సిబ్బంది మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

బయోమెడికల్ వ్యర్థాలను సాధారణ చెత్తలో కలిపితే కఠిన చర్యలు: కమిషనర్ వంశీకృష్ణ

దశ, నల్గొండ: బయోమెడికల్ వ్యర్థాలను సాధారణ మున్సిపల్ పారిశుద్ధ్య చెత్తలో కలపడం చట్టరీత్యా నేరమని నల్గొండ మున్సిపల్ కమిషనర్ బి. వంశీకృష్ణ హెచ్చరించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA) వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2026, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 అమలుపై నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు, డెంటల్ క్లినిక్‌లు, వెటర్నరీ ఆసుపత్రుల నుంచి వెలువడే బయోమెడికల్ వ్యర్థాలను సాధారణ చెత్తలో కలపడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. సూదులు, సిరంజీలు, రక్తంతో కలుషితమైన వస్తువులు, బ్యాండేజీలు, గ్లోవ్స్, శస్త్రచికిత్స వ్యర్థాలు, ప్రయోగశాల వ్యర్థాలు వంటి బయోమెడికల్ వ్యర్థాలను తప్పనిసరిగా అధీకృత ఏజెన్సీల ద్వారానే శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, రవాణా చేసి, శుద్ధి చేసి నిర్వీర్యం చేయాలని సూచించారు. తడి లేదా పొడి చెత్తలో ఇటువంటి వ్యర్థాలను కలపవద్దని వైద్య సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలను ఉల్లంఘించి బయోమెడికల్ వ్యర్థాలను మున్సిపల్ చెత్తలో కలిపే ఆసుపత్రులు, క్లినిక్‌లు లేదా ఇతర వైద్య సంస్థలపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు, జరిమానాలు, శిక్షార్హ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. నగర ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణలో వైద్య సంస్థలు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, మున్సిపల్ కార్పొరేషన్ చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలకు సహకరించి ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్. ప్రదీప్ రెడ్డి, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ రమేష్, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ ఫ్యాషన్ మాల్ ప్రారంభించిన ప్రియాంక మోహన్

దశ, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ ఎక్స్ రోడ్‌లో కిసాన్ ఫ్యాషన్ మాల్ ప్రారంభోత్సవానికి హీరోయిన్ ప్రియాంక మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతీ ప్రజ్వలన చేశారు. ఆమెతో పాటు సంస్థ యాజమాన్యం, పలువురు ప్రముఖులు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీలు, పెద్ద సంఖ్యలో ఫ్యాషన్ అభిమానులు వినియోగదారులు కూడా హాజరయ్యారు. 1959లో స్థాపించబడిన కిసాన్ ఫ్యాషన్ మాల్, ఆరు దశాబ్దాలకు పైగా నాణ్యత, విశ్వసనీయత, అందుబాటు ధరలకు ప్రతీకగా నిలుస్తూ ఫ్యామిలీ ఫ్యాషన్ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. చిన్న వస్త్ర వ్యాపారంగా ప్రారంభమైన ఈ సంస్థ నేడు తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ప్రముఖ రెడీమేడ్ వస్త్రాల రిటైల్ చైన్‌గా అభివృద్ధి చెందింది. నిజామాబాద్, మెదక్, నిర్మల్, లాతూర్, పర్భనీ, సుచిత్ర సెంటర్, బీరంగూడతో పాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో విజయవంతంగా శాఖలను నిర్వహిస్తోంది. "ఏక్‌దమ్ ఫ్యాషన్" అనే సంస్థ నినాదానికి అనుగుణంగా ఆధునిక ఫ్యాషన్, నాణ్యత, అందుబాటు ధరలను ఒకే వేదికపై అందిస్తూ కుటుంబాల కోసం సంపూర్ణ షాపింగ్ గమ్యస్థానంగా ఈ నూతన బ్రాంచ్ నిలవనుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

'క్యాచ్ ది రైన్'పై అవగాహన.. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

దశ, నల్గొండ: వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "Catch the Rain - Where it Falls, When it Falls" కార్యక్రమంలో భాగంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

"వర్షం ఎక్కడ పడితే అక్కడే, ఎప్పుడు పడితే అప్పుడే ఒడిసిపట్టాలి" అనే సందేశంతో పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటిని డ్రైన్ల ద్వారా వృథా కాకుండా ప్రతి ఇంటి వద్ద వర్షపు నీటి ఇంకుడు గుంతలు (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్స్) ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించడం, నిల్వ చేయడం, అవసరానికి అనుగుణంగా పునర్వినియోగం చేసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

మహిళా పొదుపు సంఘ సభ్యులు, ఇంటి యజమానులు తమ ఇళ్లలో అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి వర్షపు నీటి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు కోరారు. అలాగే మెప్మా రిసోర్స్ పర్సన్స్ ప్రతి కాలనీ, ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించి ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాలు 4వ డివిజన్ రామ్‌నగర్, 6వ డివిజన్ ఏఆర్ నగర్, 11వ డివిజన్ మామిళ్లగూడెం, 39వ డివిజన్ గాంధీనగర్ ప్రాంతాల్లో నిర్వహించారు. వర్షపు నీటి సంరక్షణ వల్ల కలిగే ప్రయోజనాలు, భూగర్భ జలాల పరిరక్షణ అవసరం, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని వివరించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్, మహిళా పొదుపు సంఘ సభ్యులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. నగరంలోని అన్ని డివిజన్లలో ఇదే తరహా కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.